కంది చేతికి అందనంటోంది!

- పొగమంచుతో పంటకు తెగుళ్లు
- మందులు పిచికారి చేసినా ఫలితం శూన్యం
- ఆందోళనలో అన్నదాతలు


మద్దిరేవుల గ్రామంలో పూత లేకుండా పెరిగిన కంది పంట

లక్కిరెడ్డిపల్లె : ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట పూత దశలో వర్షాబావంతో పాటు తీవ్ర పొగ మంచు కప్పేయడంతో తెగుళ్ల బారిన పడింది. వేరుశనగ సాగు చేయని రైతులు కొంత మేరకు కంది పంటను సాగు చేశారు. ఈ మధ్య కాలంలో వరుస అల్పపీడనాల ప్రభావంతో పదునుపాటి వర్షాల కారణంగా పంట ఏపుగా పెరిగింది. పూత దశలో ఉన్నప్పుడు ప్రతికూల వాతారణ పరిస్థితుల(మబ్బులు కమ్ముకోవడం) వలన పంటపై తెగుళ్ల వ్యాపించాయి. రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు వేల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో వందల హెక్టార్లకు పైబడి కంది సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట పూత దశలో తెగుళ్ల, పచ్చ పురుగు ఎక్కువగా వ్యాపిస్తోందని మద్దిరేవుల, కుర్నూతల, దిన్నెపాడు, పందిళ్లపల్లె గ్రామ రైతులు చెబుతున్నారు. మొగ్గ, పూత పూర్తిగా రాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతులు ఉన్న రైతులు మాత్రం తెగుళ్ల నివారణ కోసం వేల రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారి చేసుకోవడంతో కొంత మేర పురుగు తొలగినా పంట దిగుబడి తగ్గుతోందని అన్నదాతలు చెబుతున్నారు.

పెరిగిన కూలీ రేట్లు

పంట కొన్ని చోట్ల 7 నుంచి 8 అడుగుల ఎత్తు వరకు పెరిగింది. దీంతో చేతి పంపులతో (స్ప్రేయర్స్) మందులు పిచికారి చేయాలంటే రైతులకు కష్టంగా మారింది. రైతులు ట్రాక్టర్ల ద్వారా పిచికారి చేసుకుంటున్నారు. పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు ధరలు అంతంత మాత్రమే ఉన్నందున గిట్టుబాటు కాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. కూలీల ధరలు అమాంతంగా పెరగడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంది రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అనుకూల వాతావరణం ఉండాలి



ప్రతికూల పరిస్థితుల వలన కంది పంటలో తెగుళ్ల వ్యాపించి మొగ్గ, పూత రాలిపోతోంది. ప్రతి ఏటా నివారణకు వేల రూపాయలు ఖర్చు చేసి ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేకపోతోంది. ఐదు ఎకరాలల్లో కంది సాగు చేశాను. పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనపడడం లేదు.

- మధుసూధన మహారాజు, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

మందులు ఉచితంగా ఇవ్వాలి



ఏపుగా పెరిగిన కంది పంటకు మందులు పిచికారి చేయాలంటే కష్టంగా ఉంది. దీంతో ట్రాక్టర్ల ద్వారా మందులు కొడుతున్నాం. దీంతో ఖర్చులు పెరిగి భారంగా మారింది. వ్యవసాయాధికారులు స్పందించి రైతులకు ఉచితంగా మందులు అందజేయాలి. గిట్టుబాట ధర కల్పించేలా ప్రభుత్వానికి తెలియజేయాలి.

- పాలేపల్లి మోహన్‌రెడ్డి, చాటపల్లె గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

సకాలంలో పిచికారి చేయాలి



ప్రతికూల పరిస్థితుల వలన కంది పంటలో తెగుళ్ల ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. పంట పూత దశలో ఉన్నప్పుడు బోరాక్స్ పొడి మందును వేపనూనెతో కలిపి పిచికారి చేసుకోవాలి. తెగుళ్ల ఉధృతి తగ్గి పంట దిగుబడి వస్తుంది. సస్యరక్షణ చర్యలకు రైతులు అధికారులను సంప్రదించాలి.

- రమేష్ బాబురావు, వ్యవశాయశాఖాధికారి, లక్కిరెడ్డిపల్లె

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


విష్ణుగణపతికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

రాజంపేట రూరల్ : పంచముఖ విష్ణుగణపతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను మండల పరిధిలోని ఎంజీపురం పంచాయతీలో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో గణపతి పూజ సృష్టి, పుణ్యావాహచనం, రక్షబంధన ధారణ పంచగవ్య ప్రాశన, కలశ స్థాపన, సర్వదేవతా పూజలు, అగ్ని ప్రతిస్థాపనతో పాటు సర్వదేవతా హోమాలు, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలకు కంచె ఏర్పాటు


దాతల సహకారంతో కృష్ణంపల్లి పాఠశాల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

పుల్లంపేట : మండలంలోని కృష్ణంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నారే చలపతి, బాలిపోగు శివకృష్ణ, నారే కృష్ణకుమార్, ఆకేపాటి మురళీ, నారే విశ్వనాథ్ అందించిన రూ.50 వేలు నగదుతో కంచెను ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీవీ రమణ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం ఉంటే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయవచ్చన్నారు. అనంతరం దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సొంత నిధులతో దారి ఏర్పాటు


రోడ్డు ఏర్పాటుకు కూల్చివేస్తున్న ఇంటి వద్ద శివసాయి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో జగడంపల్లికి చెందిన వారు రైల్వే స్టేషన్‌రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఓ ఇల్లు అడ్డంకిగా మారింది. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉపసర్పంచ్ తోట శివసాయి ఆ ఇంటిని సొంత నిధులతో రూ.8 లక్షలతో కొనుగోలు చేసి శనివారం ఇంటిని కూల్చి దారి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని ఇచ్చిన హామీ మేరకు దారి ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతో జగడంపల్లి వాసులు ఉప సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేష్, కరీముల్లా, ఫరూక్ పాల్గొన్నారు.

నివాళి


బీబీ జాన్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దర్బార్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి దర్బార్ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అలాగే నందలూరు పంచాయతీ పేటగడ్డ జెండామాను వీధికి చెందిన బీబీ జాన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ గడికోట వెంకట సుబ్బారెడ్డి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, అరిగె హరిబాబు, మహబూబ్ బాషా ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త


బాబును సన్మానిస్తున్న బ్యాంక్ మేనేజర్ జగదీష్

ఒంటిమిట్ట : సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంటిమిట్ట శాఖ మేనేజర్ జగదీష్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో సైబర్ నేరాలపై ఎస్‌బీఐ ఒంటిమిట్ట శాఖ మేనేజర్ జగదీష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఒంటిమిట్ట చెరువు ప్రెసిడెంటు పాటూరు గంగిరెడ్డి సమక్షంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన బాబు కల్చరల్ ఈవెంట్స్ వారు వైఎం బాబు, వై. ఆంజనేయులు ఈ కళాజాతలో మ్యాజిక్ షో, వీధి నాటిక ప్రదర్శించారు. అద్భుత ప్రదర్శన ఇచ్చిన బాబు కల్చరల్ ఈవెంట్స్ వారిని మేనేజర్ జగదీష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట గ్రామస్తులు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటాచలపతి శనివారం సాయంత్రం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లైన్ మార్పిడి ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

రాయచోటి టౌన్ : లోకసభలో ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌తో ఉద్యోగులకు ఊరట కలిగించే విధంగా ఉందని ప్రగతి శీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర (పీఎస్‌టీయూయూ) గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర పెన్షనర్ల అసోషియేషన్ రాష్ట్ర సెక్రటరీ పీసీ రెడ్డెన్న హర్షం వ్యక్తం చేశారు. శనివారం మీడియాకు ఓ ప్రకటనను విడుదల చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం పది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా ఉద్యోగులకు మాత్రం పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. కానీ 11వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం ఆదాయపన్ను శ్లాబ్‌లు ఏడు పెంచి ఆరో శ్లాబ్‌లో 25 శాతం చేయడం, గతంలో రూ. 3లక్షల వరకు ఉన్న పన్ను మినహాయింపును రూ.4 లక్షలకు పెంచడం ప్రతి ఉద్యోగికి రూ.20 వేల నుంచి రూ.1.10 లక్షలకు వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు. రూ. 12 లక్షల ఆదాయం వరకు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదని, అలాగే స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేల వరకు ఆదాయపన్ను లేకపోవడం వేతన జీవులకు ఊరట కలిగించే అంశమని చెప్పారు.

కూటమి నాయకులవి కక్ష సాధింపు చర్యలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

గాలివీడు : కూటమి నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రత్యర్థి పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పూలికుంట ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, నూలివీడు ఎంపీటీసీ సభ్యుడు కడప అమానుల్లా పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై ఉద్దేశపూర్వకంగా అధికారులతో తప్పుడు ఫిర్యాదులు చేయించి కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజా సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయానికి ప్రజా ప్రతినిధులు వెళితే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులను జైలుకు పంపలేదా అని ప్రశ్నించారు.

ఎంపీడీఓను బదిలీ చేయాలి

ఎంపీటీసీ సభ్యుడిగా మండల సర్వసభ్య సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని సభ దృష్టికి తెచ్చానని చంద్రప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ జవహర్‌బాబు తీరును వ్యతిరేకిస్తూ ఆయనను బదిలీ చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. అధికారపార్టీ నేతలు ఎంపీడీఓను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, వీరి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి నియమనిబంధనల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందామన్నారు. తమకు నైతిక విలువలు ఉన్నాయి కాబట్టే.. ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నామన్నారు. కూటమి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని నీటి సంఘం ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు కోసం స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధులు తమ పార్టీ నాయకులను చుట్టూ ప్రదక్షిణలు చేయలేదా అని నిలదీశారు. తాము ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, కూటమి నాయకులు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలి


మన్నెం రామ్మోహన్


కుర్రమణి యాదవ్

నందలూరు : ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-302 క్యాబినేట్ డైరెక్టర్లు మన్నెం రామ్మోహన్, కుర్రా మణి యాదవ్ పిలుపునిచ్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ (రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్, పుదుచ్చేరి) డిస్ట్రిక్ట్-302 క్లబ్ 2025 సంవత్సరం నూతన కార్యవర్గం కేబినేట్ సమావేశం శనివారం పుత్తూరు వాకర్స్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-302 క్యాబినేట్ డైరెక్టర్లుగా మన్నెం రామ్మోహన్, కుర్రా మణి యాదవ్ ఎంపిక చేశారు. అనంతరం డైరెక్టర్ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ 2025 సంవత్సరానికి వాకర్స్ నూతన గవర్నర్‌గా ఆర్. మాధవ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారని తెలిపారు. నందలూరు వాకర్స్ క్లబ్ సేవలను గుర్తించి శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డు మెంబర్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ప్రోత్సాహంతో వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినేట్‌లో నందలూరు వాకర్లను డైరెక్టర్లుగా ఎంపిక చేశారని తెలిపారు.

చదువుతోపాటు ఆరోగ్యం అవసరం


మాట్లాడుతున్న వైద్యులు విద్యాదర్, శ్రీనివాసురాజు

సంబేపల్లె : విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా చాలా అవసరమని వైద్యులు విద్యాదర్, శ్రీనివాసురాజు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షల ముందు విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొంతమందికి పరీక్షలంటే ఫోబియా ఉంటుందని, అలాంటివారికి పరీక్షలపై భయాన్ని తొలగించాల్సిన అవసరం ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులపై ఉందని చెప్పారు.

సిద్దవటం జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే సాంఘిక దురాచారాలు దూరం


సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి షైజున్నీషా

లక్కిరెడ్డిపల్లి : బాలికల విద్యతోనే సమాజంలో ఉన్న దురాచారాలు, బాల్య వివాహాలు దూరమవుతాయని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి షైజున్నీషా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో తొమ్మిది, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బాలికలకు విద్య అవసరం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికలకు విద్య ఎంతో అవసరమని చెప్పారు. బాలికల చదువుకు పేదరికం అడ్డురాదని, అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండల పరిధిలోని పీఎన్ కాలనీ గ్రామ సమీపంలోకి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు డీఐజీ కోయ ప్రవీణ్, మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ విద్యా సాగర్‌నాయుడు స్వాగతం పలికారు. అనంతరం సంబేపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వీరబల్లి : మండల కేంద్రంలోని కొత్తపేట వీధుల్లో జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి సూచించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా చెక్ చేయాలన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓబులవారిపల్లె : ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన అర్హుల నుంచి రుణాలు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఫిబ్రవరి 7వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నుంచి 45 సంవత్సరాలు కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజంపేట : మండల పరిధిలోని మందరం కొత్తపల్లి వద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఊటుకూరుకు చెందిన జి. భాను ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బంధువుల దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పుల్లంపేట: పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు


రైల్వేకోడూరు అర్బన్ : ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పుల్లంపేట: పుల్లంపేటలోని శ్రీ శాంతి లింగేశ్వర స్వామి దేవస్థానంలో పెంచలకోన పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం శ్రీ ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తిరుమంజనం సేవ, విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సంతానం లేని 60 మంది మహిళలకు ఒడిబియ్యం వండించారు. ఈ కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాలే కాకుండా తిరుపతి, నాయుడుపేట, విజయవాడ సుదూర ప్రాంతాలు నుంచి కూడా వచ్చి ఒడి బియ్యం పట్టించుకున్నారు.

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడిని శనివారం కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీ మోహన్ డివిజనల్ మేనేజర్, ప్రాంతీయ మేనేజర్లు, సిబ్బంది దర్శించుకొని పూజలు చేశారు. చిట్వేలిలో కెనరాబ్యాంకు బ్రాంచ్ ఏర్పాటులో భాగంగా చిట్వేలికి వచ్చిన సందర్భంగా వీరు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే వెంకయ్యస్వామి దేవస్థానంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

4 నుంచి భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ భోగాంజనేయస్వామి

నందలూరు : మండలంలోని కుంపిణీపురంలో వెలసిన శ్రీ భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు.

ఈ నేపథ్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, తదుపరి గరుడసేవ, ప్రసాద వినియోగం రాత్రికి ఆర్కెస్ట్రా, బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అస్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు డాక్టర్ గణపతి శంకర్, ఆసంబారావు, చంద్రశేఖర్ కోరారు.

ప్రకృతి పరవశం


చిన్నఓరం పాడులో..



ఓబులవారిపల్లెలో..

దట్టమైన పొగ మంచు, చల్లటి గాలి, మనసుకు హత్తుకునే నీటి బిందువులు చూడాలంటే ఊటీకో.. అరకు లోయలకు వెళ్లి చూడాల్సిందే.. ఇలాంటి వాతావరణం శనివారం ఉదయం ఓబులవారిపల్లె సమీప గ్రామాల్లో కనువిందు చేసింది. స్థానిక రోడ్డుపై మనిషికి మనిషి కనిపించనంత దట్టమైన పొగ మంచు కమ్మేసింది. మంచు జాతీయ రహదారిపై ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. చల్లటి గాలిలో పొగ మంచులో తేలినట్టు ప్రజలు సంతోషంగా ఆస్వాదించారు. తమిళనాడులోని ఊటీ.. విశాఖలోని అరకు లోయలు విద్యార్థులకు, గ్రామ ప్రజలకు ఇక్కడే కనిపించాయి.

– ఓబులవారిపల్లె

రామయ్య కోసం.. ఊరూరా భిక్షమెత్తి..

నేడు వావిలికొలను సుబ్బారావు జయంతి


వావిలికొలను సుబ్బారావు

ఒంటిమిట్ట : భద్రాచల రామయ్య కోసం ఆలయం నిర్మించి రామభక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు రామదాసు. అదే తరహాలో ఒంటిమిట్ట కోదండరాముని ఆలయ జీర్ణోద్ధరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మరో రామదాసు వావిలికొలను సుబ్బారావు. నేడు (ఆదివారం) ఆ మహనీయుడి జయంతి. సుబ్బారావు 1863, 23, జనవరిలో ప్రొద్దుటూరులో జన్మించారు.

రామాలయం జీర్ణోద్ధరణకు..

రామాలయం జీర్ణోద్ధరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఊరూరా తిరిగి భిచ్చమెత్తారు. ఈ ధనంతో రామాలయాన్ని పునరుద్ధరించారు. ఈయన రామాయణంతో పాటు శ్రీకృష్ణలీలామృతం, ద్విపత భగవద్గీత, ఆంధ్ర విజయం, దండకత్రయం, టెంకాయ చిప్ప శతకం, పోతన నికేతన చర్చ, శ్రీరామనుతి, కౌసల్య పరిణయం లాంటి ఎన్నో రచనలు కూడా చేశారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని 24వేల చందోభరిత పద్యాలుగా తెలుగులో రాశారు. ఆయన రాసిన రామాయణాన్ని ఒంటిమిట్ట శ్రీ కోదండరామునికి అంకితం ఇచ్చారు. అప్పుడు బళ్లారి రాఘవ అధ్యక్షతన జరిగిన సభలో మహా పండితులు వావిలికొలను సుబ్బారావుకు ఆంధ్రా వాల్మీకి అని బిరుదును ప్రదానం చేశారు. వావిలికొలను సుబ్బారావు జయంతి సందర్భంగా ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు.